క్లుప్తంగా

చెట్ల తాండ్ర ఉత్సవాలకు తిలక్‌కు ఆహ్వానం


తిలక్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

సంతబొమ్మాళి: భీష్మ ఏకాదశి సందర్భంగా చెట్లతాండ్రలో మంగళవారం నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌కు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఆహ్వాన పత్రిక అందించారు. ఏటా జరుగు పరవస్తు అయ్యవారి (శ్రీలక్ష్మీ నరసింహస్వామి) ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా భక్తులు వేలాది అరటి గెలలను మొక్కులుగా సమర్పిస్తారు కమిటీ సభ్యులు పంగ అప్పన్న, రామయ్య ఉన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: విద్యా వ్యవస్థ మౌలిక సంస్కరణల్లో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా ఉండాలని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. లొద్దపుట్టి, ఈదుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పాఠశాల సముదాయ సమావేశాలను సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించడం ద్వారా ఆరోగ్యవంతమైన నైతిక విలువలతో పాటు కార్యశీలత, కారుణ్యం, సహానుభూతి, సృజనాత్మక శక్తిని ఉపాధ్యాయులు పంచుకోవచ్చని అన్నారు.

డ్రైవర్లకు నేత్ర పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఇచ్ఛాపురం: వాహన చోదకులు ఎటువంటి కంటిదృష్టి లోపం లేకుండా జాగ్రత్త వహించాలని ఎంవీఐ వి.వెంకటరావు సూచించారు. మున్సిపాలిటి పరిధి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఆవరణలో ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సౌజన్యంతో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ దుర్గాప్రసాద్, ఎస్.వెంకటరావు, ఎం.చంద్రారెడ్డి, ఎం.మోహన్‌రావు, వైద్యులు ఉగ్రసేన్, సిబ్బంది హేమలత, రామకృష్ణ, శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 20వవార్డు లేబరు కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను నాయకులు సోమవారం పరిశీలించారు. వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి కౌన్సిల్ సమావేశంలో రోడ్డు సమస్యను ప్రస్తావించారు. దీంతో అధికారులు నిధులు మంజూరు చేశారు. మంకినమ్మ ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ఉన్నటువంటి లేబరు కాలనీలో 300 మీటర్ల సీసీ రోడ్డును రూ.17 లక్షలతో నిర్మిస్తున్నారు. పనులను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు, నాయకులు పైల నరసింహమూర్తి, బమ్మిడి సుధాకర్ పరిశీలించారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

నందిగాం: బ్యాంకు సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలనితామరాపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ మురళీమోహన్ సూచించారు. తామరాపల్లిలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా బ్యాంకు సేవలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు అప్పలనాయుడు, సలాన జోగేంద్రనాయుడు, ఎం.రాములమ్మ, ఆర్.కూర్మారావు, సలాన సంజీవరావు, కె.శ్రీరాములు, ఎస్.అప్పారావు, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళులు


శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి: పట్టణంలోని రంగ్రేజ్ భావసార్ క్షత్రియ కులస్తుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సూత్రయ భాస్కర్‌బాబు, గుజ్జురు ధనుంజయ్, రవి, శ్రీను, కుమార్, బాలాజీ, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

కమ్మనైన 'జగనన్న గోరుముద్ద'

- పాఠశాలలో భోజనానికే విద్యార్థులు ప్రాధాన్యం
- రుచికరమైన చిక్కీ, రాగి జావతో ఆరోగ్యం
- పలాస నియోజకవర్గంలో 25,800 మందికి ప్రయోజనం




భోజనాన్ని తింటున్న పాతటెక్కలి ఉన్నత పాఠశాల విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: చక్కటి రుచి.. మంచి పోషకాలు.. చిన్నారులకు అమ్మ పెట్టే రుచికరమైన భోజనం కంటే మెండు ఏదైనా ఉందీ అంటే అది ఒక్క జగనన్న గోరు ముద్దే అని చెప్పాలి. ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరు ముద్ద పథకాన్ని ప్రవేశ పెట్టారు. మెనూలో సమూల మార్పులు చేపట్టి చిన్నారుల పోషణకు గతం కంటే మెరుగ్గాదీన్ని అమలు చేస్తున్నారు. దీంతో జగనన్న గోరుముద్దకు ఆదరణ లభించింది. పాఠశాలలోనే మధ్యాహ్నం భోజనం చేసేందుకు విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

మెనూలో సమూల మార్పులు..

గత ప్రభుత్వంలో మధ్యాహ్నం భోజనం ద్వారా అన్నం, కూర, సాంబారు, వారానికి ఒక గుడ్డు. పిల్లలకు పెట్టేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెనూలో సమూల మార్పులు చేశారు. గతంలో అందని ద్రాక్షలా మారిన కోడి గుడ్డును సైతం వారంలో ఆరు రోజులు పాటు పెట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. ముద్ద పప్పు, తీపి పొంగలితో పాటు మూడు రోజులు రాగి జావ, మరో మూడు రోజులు పాటు చిక్కీని చేర్చి రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నారు.

పలాస నియోజకవర్గంలో పాఠశాలలు, గోరుముద్ద తీసుకుంటున్న విద్యార్థులు

మండలం	పాఠశాలలు	గోరుముద్ద అందుతున్న విద్యార్థులు
వజ్రపుకొత్తూరు	90	7,800
మందస	126	10,900
పలాస	83	7,100
మొత్తం	299	25,800

మెనూ వివరాలు..

సోమవారం	అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు కూర , వేరుశనగ చిక్కీ
మంగళవారం	పులిహోరా, టమాటా పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం	అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం	అన్నం, పప్పు, తీపి పొంగలి, రాగి జావ

భోజనం బాగుంది



మా పాఠశాలలో రోజూ మధ్యాహ్నం అందిస్తున్న భోజనం రుచిగా, సుచిగా ఉంది. నేను ప్రతి రోజూ ఇక్కడే తింటున్నాను. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. మా సార్‌లు వచ్చి తనిఖీ చేసి అందరికీ సరిపడా భోజనం పెడుతున్నారు. కొద్ది నెలల నుంచి రాగి జావ కూడా వారంలో మూడు రోజులు ఇస్తున్నారు. శని, ఆదివారాలు తప్ప రోజూ గుడ్డ తింటున్నాను.

–అల్ల స్వాతి, విద్యార్థిని, భావనపాడు, సంతబొమ్మాళి మండలం

చిక్కీ అంటే ఎంతో ఇష్టం



మధ్యాహ్న భోజనంలో జగన్ మామ అందిస్తున్న వేరుశనగ చిక్కీ అంటే నాకు ఎంతో ఇష్టం. ఆ తరువాత తీపి పొంగలి, ప్రోటీన్‌లు అధికంగా ఉండే కోడి గుడ్డు తింటున్నాను. మొదట్లో ఇక్కడ భోజనం ఎలా ఉంటుందోనని ఇంటి నుంచి బాక్స్ తెచ్చుకునేదాన్ని. నా ఫ్రెండ్స్ పాఠశాలలోనే తినడంతోపాటు రుచిగా ఉందని చెప్పడంతో నేనూ పాఠశాలలోనే తినడం ప్రారంభించాను. చాలా బాగుంది.

– కె.ఎస్మార్, విద్యార్థి, లింగాలపాడు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రతిఘటనోద్యమానికి దిక్సూచి జయమ్మ


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

మందస: సమరశీల ప్రతిఘటనోద్యమానికి దిక్సూచి ధీరవనిత జయమ్మ అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.కుసుమ అన్నారు. మండలంలోని గిరిజన ప్రాంతాలైన కుల్లోగాం, కిల్లోయి, బంసుగాం, బలియాగాం తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. త్యాగాల జయమ్మ నడిచిన త్యాగాల బాటలో నడవమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ నెల 22న జరిగే జయమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు రాపాక మాధవరావు, జజ్జే అప్పయ్య, బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, నరసింహులు, తవుడు, రామ్మూర్తి, జానీ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మహామృత్యుంజయేశ్వరుని ప్రతిష్ట


మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

కవిటి: ముత్యాలపేటలో నూతనంగా నిర్మించిన అమృతవర్షిణీ సమేత మహామృత్యుంజయేశ్వర స్వామి, మోక్షసీతారామస్వామి, షిర్డీసాయి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వాముల ఆలయాల ప్రతిష్ఠ కనులపండువగా నిర్వహించారు. సోమవారం వేకువ జామునుంచే ఆలయానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. పూజల్లో భాగంగా యంత్రస్థాపన, గర్తన్యాసము, విగ్రహప్రతిష్ఠ, శిఖరప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నందివాహన ప్రతిష్ఠ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. 24 గంటలపాటు హరేరామ హరేకృష్ణ తారకనామమంత్ర యజ్ఞం జరిగింది. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం స్వామివారి తిరువీధి ఉత్సవం కన్నులపండువగా నిర్వహించారు.

సత్వరమే నిధుల చెల్లింపు


మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఐవీ రమణ

కవిటి: పీఎఫ్ఎంఎస్ విధానంలో గ్రామపంచాయతీల అభివృద్ధి పనులు చేపట్టిన మేరకు నిధుల చెల్లింపు ప్రక్రియ సత్వరమే చేపట్టాలని డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన పంచాయితీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు పలు అంశాలు వివరించారు. ఇంటిపన్ను వసూళ్లను శతశాతం పూర్తి చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి చేసుకున్న దరఖాస్తుల్ని పరిశీలించి అర్హులందరికీ సత్వరమే ఈ పథకం వర్తించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ఇతర ప్రభుత్వ కార్యక్రమాల అమలు పురోగతిపై ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహితో సమీక్షించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టుకార్డు ఉద్యమం


పోస్టు కార్డు ఉద్యమం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మందస: యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టు కార్డు ఉద్యమం కార్యక్రమం హరిపురంలో జరిగింది. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే సీపీఎస్‌ను రద్దు చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ మేరకు పోస్టుకార్డులను ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులకు పోస్టు కార్డు క్యాంపెయిన్ ద్వారా పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దాసరి ఈశ్వరరావు, గున్న రమేష్, గుంట కోదండరావు, మార్పు చక్రధరరావు, లండ రాజారావు, కె.రమణమూర్తి, పి.మల్లికార్జునరావు, మజ్జి కుమారస్వామి, ఉమామహేశ్వరరావు, మదన్మోహన్, బి.లక్ష్మినారాయణ, నరసింహమూర్తి, సార భాస్కరరావు పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి తెలిపారు. నా భాష అంటే నాకు ఇష్టం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి కవి సమ్మేళనం, కవులకు సన్మానం, మాతృభాషపై కవులు, కళాకారులతో ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

క్రీడా మైదానాన్ని రక్షించాలి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి సురంగిరాజా క్రీడా మైదానం ఆక్రమణకు గురౌతుందని స్థానిక క్రీడాకారులు, మైదానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అన్నారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని మైదానాన్ని పరిరక్షించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, తహసీల్దారికి సోమవారం స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు.

లక్ష్మి అనే మహిళ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం పనులు చేసేందుకు మైదానానికి వెళ్లే మార్గాన్ని ఆక్రమించినట్టు పేర్కొన్నారు. ప్రతినిధులు బి.వెంకటరమణ, కె.పాపారావు, క్రీడాకారులు చిరంజీవి, బలరామ్, కార్తిక్, చిన్నా, లోహిదాస్ ఉన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

కంచిలి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో మండలస్థాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీరజ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

వలంటీర్లకు సేవా పురస్కారాలు

మందస: మందస మండలంలోని గ్రామ వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో ఆరసాడ రఘుపతిరావు తెలిపారు. మండలంలో 430 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. వీరిలో సవర మౌనిక, సవర వైకుంఠరావు సేవా వజ్రకు ఎంపికయ్యారని, వీరికి రూ.45 వేలు, బొడ్డు స్వాతి, గొడారాజేంద్ర, సవర నిర్మల, సవర వాణిశ్రీ, కిస్తు నిరోషా సేవారత్నకు ఎంపికయ్యారని, వీరికి రూ.30 వేలు చొప్పున అందజేయనున్నామన్నారు. సక్రమంగా పని చేసిన 423 మందికి సేవారత్న కింద రూ.15 వేల చొప్పున మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా ఈ నెల 20వ తేదీన అందజేసి సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మందసలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

మందస: మందస పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం ఉదయం పది గంటలకు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలుగుభాష, జానపద కళాపీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవంగా ఈ నెల 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం. అయితే ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మాతృభాషలైన తెలుగు, ఒడియాతో పాటు లిపిలేని ఆదివాసీ భాషలైన సవర, గదబ, జాతాపు, కోయ, ఎరుకుల, రెల్లి, పైడి తదితర భాషలను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. వీటి ప్రాశస్త్యం ప్రతీ ఒక్కరికీ వివరించాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా శైలజ

టెక్కలి: కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా టెక్కలికి చెందిన కొత్తూరు శైలజను నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ఆధ్వర్యంలో శైలజకు బాధ్యతలు అప్పగించారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం


మాట్లాడుతున్న నిమ్మన దాస్

సోంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న నిధులతో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. ఎంపీడీవో కె.రామారావు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీరాజ్ జేఈ రమేష్ ఉన్నారు.

వలంటీర్లంటే వారికి భయం


వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: వలంటీర్లంటే చంద్రబాబు, అచ్చెన్నాయుడుకు భయం పట్టుకుందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. రానున్న ఎన్నికల్లో వలంటీర్ల సవరేంటో చూపించనున్నారని వ్యాఖ్యానించారు. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 449 మంది గ్రామ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వలంటీర్లు చేస్తున్న సేవలకు రానున్న ఎన్నికల్లో టీడీపీ గల్లంతవుతుందన్న భయంతో చంద్రబాబు, అచ్చెన్నాయుడు సహా టీడీపీ నాయకులు అసూయతో వారిని ద్వేషిస్తున్నారన్నారు. వృద్ధులు, ఒంటరి వ్యక్తులకు వారి కుటుంబ సభ్యులు చేయలేని సాయాన్ని వలంటీర్లు చేస్తున్నారని కొనియాడారు. వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు మరోసారి దిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. చిన్నసాన, లఖందిడ్డి, హరిశ్చంద్రపురం వలంటీర్లు ఎండ అరుణ, చింతాడ స్వప్న, గంగి లక్ష్మణరావు, హనుమంతు గజలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా తమకు గౌరవ పెరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, మండలప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు బాదాన మురళీధర్, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూళ సత్తిరాజు, జేసీఎస్‌మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, ఎంపీడీవో వై.పద్మజ, ఎంఎల్‌వోలు తారకేశ్వరరావు, ఎస్ఎస్ చైతన్య, సర్పంచ్‌లు కాళ్ల సంజీవరావు, జి.కేశవరావు, సుంకరి జనార్దన, పి.వెంకటరావు, మెండ తాత, ఎంపీటీసీ సభ్యులు బొడ్డు అప్పన్న, బగాది దివాకర్, దుక్క రామక్రిష్ణ ఉన్నారు.

అప్రమత్తతోనే అగ్నిప్రమాదాల నివారణ


మాట్లాడుతున్న సోమేశ్వరరావు

కాశీబుగ్గ: అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని పలాస అగ్నిమాపక కేంద్రం అధికారి బొమ్మాళి సోమేశ్వరరావు అన్నారు. కేంద్రం ఎదురుగా సోమవారం ఫైర్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎక్కువ అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉందని.. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం నిర్వహించారు.

క్రీడాకారులకు అభినందన


కాశీబుగ్గ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చిన్నంనాయుడు

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి గ్రిగ్స్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. షాట్‌పుట్‌లో విద్యార్థిని జ్ఞానేశ్వరి విజేతగా నిలవగా.. బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. అలాగే అథ్లటిక్స్ ఆరు విభాగాల్లో మూడు బంగారు, మూడు సిల్వర్ పతకాలు సాధించారు. దీంతో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వై.చిన్నంనాయుడు చేతులమీదుగా సోమవారం సర్టిఫికెట్లు, మెమెంటోలు, మెడల్స్ అందించి అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు కుసుమహరినాథ్, తెలుకల గణేష్, నగిరి లక్ష్మి ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అభినందన


వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఇటీవల నిర్వహించిన గ్రిగ్స్ పోటీలలో కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబర్చిన వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తారకేశ్వరరావు పండా మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి.గజేంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఉపాధి పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం గ్రామంలోని మొసలి చెరువులో రూ. 8 లక్షలతో చేపట్టనున్న ఉపాధి హామీ పథకం పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. వైస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బదకల మోహన్‌దాస్ పనులను ప్రారంభించారు. అర్హులైన వారికి జాబ్ కార్డులు అందజేసి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పెద్ద బదకల పాపయ్య పాల్గొన్నారు.

నేడు భీష్మ ఏకాదశి వేడుకలు

కంచిలి: కంచిలిలో కంచమ్మతల్లి ఆలయం ఆవరణలోని వెంకటేశ్వర స్వామి గుడిలో భీష్మ ఏకాదశి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవ, స్వామివారి అభిషేకం, నిత్యపూజ కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారిని మేళతాళాలతో తిరువీధి ఊరేగింపు, ఆరు గంటలకు స్వామివారి ఊంజల్ సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా రామకృష్ణసేవా సంఘం వార్షికోత్సవం

కాశీబుగ్గ: పలాసలోని రామకృష్ణసేవా సంఘం 65వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం గౌరవ అధ్యక్షుడు బల్ల సుభాష్ మాస్టారు సంఘం ద్వారా చేసిన సేవలను వివరించారు. పలాస పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలకు, యువతరానికి ఉపయోగ పడాలనే ఉద్దేశంతో చందాలు వేసుకుని గ్రంథాలయాన్ని నిర్మించామని గుర్తు చేశారు. సీనియర్ సభ్యులు జేసీహెచ్ శ్రీనివాసరావు, మోహనరావు, హేమారావు, సూర్యం, చిరంజీవులు, కార్యదర్శి సూరిబాబు, గ్రంథాలయ సూపర్‌వైజర్ వైకుంఠ బెహరా ఉన్నారు.

చంద్రపతి మృతికి సంతాపం

కాశీబుగ్గ: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడుగా సుదీర్ఘకాలం సేవలందించిన పిట్టా చంద్రపతిరావు అకాల మరణం తీరనిలోటని జిల్లా గౌడ్రైలు, మేకల పెంపకందారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు రాపాక చిన్నారావు అన్నారు. చంద్రపతి మృతికి సంతాపం తెలియజేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వజ్రపుకొత్తూరు రూరల్: త్వరలో జరగనున్న ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. పల్లిసారథిలోని పోలింగ్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఆర్ఐ పవిత్ర ఉన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రానికి పెన్షనర్ల సాయం

కంచిలి: మండపల్లిలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ఆవరణలో దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్రం భవన నిర్మాణానికి సోంపేటకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు రూ. 15వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్‌కు సోమవారం అందేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని జ్ఞానభారతి సీబీఎస్‌ఈ పాఠశాల ఆవరణలో వికసిత్ భారత్, వికసిత్ రైల్వే అనే అంశాలపై ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను సోమవారం నిర్వహించారు. ఖుర్దారోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రమోద్ పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. పాఠశాల సెక్రటరీ జోహార్‌ఖాన్ పాల్గొన్నారు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సంతబొమ్మాళి: పిన్నింటిపేట సబ్‌స్టేషన్ పరిధిలో బోరుభద్ర పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ ఎం.శివకుమార్ సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో బై ఎక్స్‌టెన్షన్ వర్క్ చేపడుతున్నందున ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలి

పలాస: కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఇంటిపన్నులను తక్షణమే వసూలు చేయాలని చెప్పారు. ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు ఉన్నారు.